పర్యాటక హబ్‌గా జిల్లా..

- రూ. 70కోట్లతో రామప్ప సరస్సులో హట్స్, ఐల్యాండ్ నిర్మాణం
- ఏజెన్సీలో రోడ్ల అభివృద్ధికి రూ.17.98 కోట్లు మంజూరు
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క


ఏటూరునాగారంలో కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్న మంత్రి సీతక్క


మంగపేటలో అటవీశాఖ రేంజ్ అధికారి క్వార్టర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

ఏటూరునాగారం/కన్నాయిగూడెం/మంగపేట : ములుగు జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. జిల్లాలోని ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట మండలాల్లో మంత్రి సీతక్క మంగళవారం పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏటూరునాగారంలోని తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మీ, షాదిముబారక్ చెక్కులను 45మందికి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పలువురికి అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంవత్సర కాలంలోనే మారుమూల గ్రామాల్లో సైతం రహదారుల ఏర్పాటుకు నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా రామప్ప సరస్సులో ఐల్యాండ్, హట్స్ నిర్మాణానికి రూ.70 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. బ్లాక్‌బెర్రీ హట్స్ నిర్మాణంతో ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుందని తెలిపారు. గట్టమ్మ, సమ్మక్క–సారలమ్మ, మల్లూరు గుట్ట, లక్నవరం, బొగత వంటి ప్రాంతాలతో పాటు మరికొన్ని ప్రాంతాలను సైతం పర్యాటక ప్రాంతాలుగా మార్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం సాయిబాబా ఆలయంలో ఎస్‌బీఐ ఆర్ ఎస్ఈటీఐ ద్వారా కుట్టుశిక్షణ నేర్చుకున్న 65 మంది మహిళలకు సర్టిఫికెట్లను మంత్రి అందజేశారు.

రూ.17.98 కోట్లతో రోడ్ల అభివృద్ధి

ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం మండలాల్లో రూ.17.98 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు మంత్రి సీతక్క తెలిపారు. రోడ్ల అభివృద్ధికి పంచాయతీరాజ్ శాఖ నుంచి నిధులను మంజూరు చేయించినట్లు తెలిపారు. రామన్నగూడెం నుంచి పక్కాపురం వరకు రెండున్నరకోట్ల రూపాయలతో రోడ్ల పనులు, జెడ్పీ రోడ్డు నుంచి రాంనగర్ వరకు రూ.50 లక్షలతో రోడ్ల మరమ్మతులకు, రాంనగర్ వెళ్లే రహదారి వాగుపై నిర్మించిన బ్రిడ్జికి నిధులు సరిపోకపోవడంతో మరో రూ.3 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఏటూరునాగారం మండల పరిధిలోని చిన్నబోయినపల్లిలో రూ.30 లక్షలతో నిర్మించిన డిప్యూటీ రేంజ్ అధికారి భవనాన్ని ప్రారంభించారు. కన్నాయిగూడెం మండలంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. మంగపేట మండల కేంద్రంతో పాటు బ్రాహ్మణపల్లి, నిమ్మగూడెం తదితర గ్రామాల్లో మంత్రి సీతక్క పర్యటించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో రూ.34లక్షల కంపా నిధులతో నిర్మించిన అటవీశాఖ రేంజ్ అధికారి నివాస భవనాన్ని ప్రారంభించి పలు బీటీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ శబరీశ్, అదనపు కలెక్టర్ మహేందర్ జీ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచంద్ర, ఆర్డీఓ వెంకటేశ్, ఏటూరునాగారం, కన్నాయిగూడెం తహసీల్దార్లు జగదీశ్వర్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఏటూరునాగారంలోని సీఎస్ఐ చర్చిలో విద్యుత్ కాంతులతో పశువుల పాక



ములుగులోని జీవజలముల ప్రార్థన మందిరంలో కేక్ కట్ చేస్తున్న క్రైస్తవులు




దేవగిరిపట్నం చర్చిలో క్రీస్తు ఆరాధకులు

హ్యాపీ క్రిస్మస్

- చర్చీలలో ప్రత్యేక ప్రార్థనలు
- కేక్ కటింగ్‌లు

ములుగు రూరల్/ఏటూరునాగారం: జిల్లాలో క్రిస్మస్ వేడుకలు మంగళవారం అర్ధరాత్రి ప్రారంభమయ్యాయి. 12 గంటలకు ఏసుక్రీస్తు జన్మించిన సమయంలో జిల్లాకేంద్రంలోని జీవజలముల, దేవగిరిపట్నం చర్చిలతో పాటు ఏటూరునాగారం, మంగపేటలోని పలు చర్చిల్లో ఫాదర్లు ప్రత్యేక ప్రార్థనలు చేసి కేక్‌లు కట్ చేశారు. చర్చిలకు క్రైస్తవులు భారీగా తరలిరావడంతో కిక్కిరిసిపోయాయి. విద్యుత్ దీపాలతో చర్చిలు కాంతులీనాయి. చర్చిల ఆవరణల్లో క్రిస్మస్ స్టార్, క్రిస్మస్ తాత, పశువుల పాక, ట్రీని ఏర్పాటు చేశారు.

పీహెచ్‌సీల్లో మందులు నిల్వ చేసుకోవాలి

ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా

ఏటూరునాగారం: ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అత్యవసర మందులను నిల్వ చేసుకోవాలని ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఐటీడీఏ పరిధిలోని 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో పీఓ మంగళవారం సమీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అత్యవసర మందులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నిల్వ చేసుకోవాలన్నారు. దాంతో పాటుగా అత్యవసర చికిత్స గల రోగులకు రెఫర్ చేయడానికి వాహన సౌకర్యాన్ని కల్పించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సెంటర్ల సివిల్ వర్క్ పనులకు సంబంధించిన అంచనాలను ఐటీడీఏ కార్యాలయానికి పంపించాలని పీహెచ్‌సీ వైద్యులను ఆదేశించారు. అందుబాటులో లేని వైద్య పరికరాలు సమకూర్చుకోవాలన్నారు. వైద్య కేంద్రాలకు వచ్చే రోగులు అసౌకర్యానికి గురికాకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ గోపాలరావు, ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్ఓ క్రాంతికుమార్, ఎన్‌హెచ్ఎం ప్రోగ్రాం అధికారి మహేందర్‌తో పాటు వైద్యులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పీఓ చిత్రామిశ్రా

రామప్పను సందర్శించిన అమెరికా దేశస్తులు



వెంకటాపురం(ఎం): మండల పరిధిలోని చారిత్రక రామప్ప దేవాలయాన్ని అమెరికాకు చెందిన వాండి జోన్స్, హెడెన్‌లు మంగళవారం సందర్శించారు. రామప్ప రామలింగేశ్వరస్వామిని వారు దర్శించుకోగా ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. రామప్ప ఆలయ విశిష్టత గురించి గైడ్ విజయ్‌కుమార్ వివరించగా రామప్ప టెంపుల్ బ్యూటిఫుల్ అంటూ కొనియాడారు.

రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపిక


నవ్య


వేద జస్విత

వెంకటాపురం(ఎం): హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో ఈ నెల 31 నుంచి నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు మండల కేంద్రంలోని మైనార్టీ కళాశాలకు చెందిన పీడీ నవ్య, విద్యార్థిని వేద జస్విత ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ వందన తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక బృందం మంగళవారం వారిని అభినందించింది. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జాకారంలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీలలో షాట్‌పుట్ విభాగంలో పీడీ నవ్య, డిస్కస్ త్రో విభాగంలో వేద జస్విత అత్యంత ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వెల్లడించారు.

మద్యం తాగి.. విధులకు హాజరు


మద్యం మత్తులో ఉన్న ఉపాధ్యాయుడు

ఏటూరునాగారం: మండల పరిధిలోని కొండాయి పంచాయతీ పరిధిలోని మల్యాల గిరిజన ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఓ ఉపాధ్యాయుడు మద్యం తాగి మంగళవారం విధులకు హాజరయ్యారు. అయితే ఈ విషయాన్ని గ్రామంలోని ఓ వ్యక్తి వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది. విద్యార్థులు చదువుకునే పాఠశాలకు ఉపాధ్యాయుడు మద్యం తాగి రావడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఐటీడీఏ అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

పోలీస్‌స్టేషన్ భవనం పనుల పరిశీలన


భవనాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ శబరీశ్

మంగపేట: మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్‌లో నూతనంగా చేపట్టిన భవనం నిర్మాణ పనులను ఎస్పీ శబరీశ్ మంగళవారం రాత్రి పరిశీలించారు. మండలంలో మంత్రి సీతక్క పర్యటనలో భాగంగా పోలీస్ బందోబస్తు పర్యవేక్షణపై మండలానికి వచ్చిన ఎస్పీ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన నూతనంగా నిర్మాణం చేస్తున్న భవన నిర్మాణం పనుల గురించి ఎస్సై టీవీఆర్ సూరీతో కలిసి క్షుణ్ణంగా పరిశీలించి పలు సూచనలు చేశారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు

- అటవీశాఖ డివిజనల్ అధికారి రమేశ్


సమావేశంలో మాట్లాడుతున్న ఎఫ్‌డీఓ రమేశ్

ఏటూరునాగారం: వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏటూరునాగారం అటవీశాఖ డివిజనల్ అధికారి రమేశ్ తెలిపారు. ఇండియన్ పాంగోలిన్ జంతువును (అలుగు) వేటాడిన వేటగాళ్లను అటవీశాఖ అధికారులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి.. నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించింది. ఈ వివరాలను మంగళవారం మండల కేంద్రంలోని ఎఫ్‌డీఓ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అటవీశాఖ డివిజనల్ అధికారి రమేశ్ వెల్లడించారు. కన్నాయిగూడెం మండలం భూపతిపూర్, కమాన్‌పల్లి పరిసరాల్లో వేటగాళ్లు వన్యప్రాణి జంతువుల కోసం వచ్చినట్లు సమాచారం అందింది. దీంతో ములుగు జిల్లా వన్యప్రాణుల విభాగ అధికారులు మూడు రోజులపాటు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి లైవ్ ఇండియన్ పాంగోలిన్ జంతువును(అలుగు) రక్షించి వేటగాళ్ల ముఠాను పట్టుకున్నారు. భూపతిపూర్‌కు చెందిన ప్రధాన నిందితుడు చిదం రవితోపాటు కోరం నాగయ్య, కోరం పెంటయ్య, కోరం కృష్ణమూర్తిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి.. నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించారు. వన్యప్రాణులను వేటాడితే ఏడేళ్ల జైలు, రూ. లక్ష జరిమానా ఉంటుందని రమేశ్ తెలిపారు. కాగా, ప్రపంచ వ్యాప్తంగా అంతరించిపోతున్న జంతువుల జాబితాలో భారతీయ పాంగోలిన్ (అలుగు) ఒకటి. ఈ జంతు మాంసానికి అంతర్జాతీయ బ్లాక్ మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉంది.



గోల్డ్ బిడ్డింగ్ పేరిట సైబర్ మోసం

- రూ.4.15 లక్షలకుపైగా పోగొట్టుకున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్
- పోలీసులకు ఫిర్యాదు

మహబూబాబాద్ రూరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంత అవగాహన కల్పిస్తున్నా ఇంకా పలువురు సైబర్ క్రైం మోసాలకు బలవుతూ డబ్బులు పోగొట్టుకుంటున్నారు. గోల్డ్ బిడ్డింగ్ పేరిట మెసెజ్ రాగా అది నిజమని నమ్మిన ఓ సాఫ్ట్ వేర్ ఇంజనీర్.. అందులో పెట్టుబడి పెట్టాడు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయి రూ.4.15 లక్షలకుపైగా పోగొట్టుకుని పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఘటన మంగళవారం జిల్లా కేంద్రంలో వెలుగుచూసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మహబూబాబాద్‌కు చెందిన ఓ యువకుడు హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో అతడికి ఈనెల 15వ తేదీన మధ్యాహ్నం టెలిగ్రామ్ యాప్ ద్వారా ఓ మెసెజ్ వచ్చింది. గోల్డ్ బిడ్డింగ్ గ్రూపులో 68 మంది సభ్యులు ఉన్నారని, అందులో ఉన్న మహిళ గైడ్‌గా వ్యవహరిస్తోందని సమాచారం పంపించారు. దీంతో ఆ యువకుడు మొదట రూ.8 వేలు పెట్టుబడి పెట్టగానే కొంత సమయానికి అతడి బ్యాంకు ఖాతాలో రూ.10 వేలు జమ అయ్యాయి. వెంటనే రూ.19,185 పెట్టుబడి పెట్టగా రూ.38 వేలు జమ అయ్యాయి. దీంతో మరింత పెట్టుబడి పెడితే అధిక మొత్తంలో డబ్బులు వస్తాయని గోల్డ్ బిడ్డింగ్ పేరిట సైబర్ నేరగాళ్లు 15వ తేదీ నుంచి మరో నాలుగు రోజుల వరకు రూ. లక్ష వరకు పెట్టుబడి పెట్టించారు. అదేవిధంగా తన మిత్రుడి బ్యాంకు ఖాతా నుంచి కూడా రూ.1.75 లక్షల మొత్తాన్ని టెలిగ్రామ్ యాప్ నుంచి వచ్చిన ఐడీ నంబర్‌కు ఫార్వర్డ్ చేశాడు. మరో రెండుసార్లు రూ.50 వేల చొప్పున, ఆ వెంటనే మరోసారి రూ.50,100, మళ్లీ పలుమార్లు రూ.80 వేలు, ఆ విధంగా మొత్తం తన బ్యాంకు ఖాతాల నుంచి, మిత్రుడి బ్యాంకు ఖాతా నుంచి సుమారు రూ.4.15 లక్షల వరకు పెట్టుబడులు పెట్టాడు. దీంతో ఆ యువకుడికి డైమండ్ బిడ్డింగ్ పేరిట స్క్రాచ్ కార్డు వచ్చిందని సైబర్ నేరగాళ్లు సమాచారం పంపించారు. దీనిని స్క్రాచ్ చేస్తే మరింత మొత్తంలో డబ్బులు వస్తాయని, దీనిని వేలం వేయాలని గ్రూప్ లీడర్ చెప్పగా నమ్మి ఒకే అన్నాడు. అవతలి వ్యక్తులు మరోసారి రూ.4.20 లక్షలు పంపిస్తే రూ.4.15 లక్షలు వస్తాయని చెప్పారు. దీనిని సదరు ఉద్యోగి నమ్మలేదు. ఈ క్రమంలో పెట్టుబడి డబ్బుల కోసం నాలుగు రోజులుగా అడుగుతున్నా అవతలి వ్యక్తులు ఇవ్వకపోవడంతో తాను సైబర్ మోసానికి గురయ్యానని బాధితుడు గుర్తించాడు. వెంటనే సైబర్ క్రైమ్ విభాగం పోలీసులను సంప్రదించి 1930కి ఫిర్యాదు చేశాడు. అనంతరం మహబూబాబాద్ టౌన్ పీఎస్‌లో కూడా ఫిర్యాదు చేశాడు.

యూనివర్సిటీ పదవుల్లో బీసీలను నియమించాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

కేయు క్యాంపస్ : తెలంగాణ రాష్ట్రంలోని విశ్వ విద్యాలయాల్లో జనాభా దామాషా ప్రకారం వైస్‌చాన్స్‌లర్‌తో పాటు ఇతర పాలన పదవుల్లో బీసీలను నియమించేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఊరుకోబోమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం కేయూ గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు నియమించిన వైస్ చాన్స్‌లర్ పదవుల్లో కేవలం ముగ్గురు బీసీలకు మాత్రమే అవకాశం కల్పించి తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌గా బీసీకి అవకాశం కల్పించకపోతే ఆ మండలి ఎదుట నిరసన తెలుపుతామని స్పష్టం చేశారు. ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాల భూములు ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. విశ్వవిద్యాలయాల భూములను కాపాడే వరకు పోరాటం చేస్తామని తెలిపారు. ఖాళీలను భర్తీ చేసి యూనివర్సిటీలను బలోపేతం చేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, మెస్‌బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. విద్యార్థుల త్యాగాలతోనే వచ్చిన రాష్ట్రంలో బడుగు, బలహీన విద్యార్థులకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వాన్ని నిలదీయడమే లక్ష్యంగా బీసీ సంక్షేమ సంఘం బాధ్యతతో ముందుకెళ్తోందన్నారు. ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటుతో ప్రభుత్వ యూనివర్సిటీలు నిర్వీర్యమవుతున్నాయన్నారు. ప్రభుత్వ యూనివర్సిటీల్లో టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 'హైడ్రా'ను స్వాగతిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆరేగంటి నాగరాజు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, దాడిమల్లయ్య యాదవ్, అశోక్ గౌడ్, బోనగాని యాదగిరి గౌడ్, ప్రదీప్‌గౌడ్, రీసెర్చ్ స్కాలర్స్ మహబూబ్‌పాషా, అభిరామ్, నాగరాజు, పృథ్వీ, వేణు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్

కామేశ్వరాలయ పనులకు తొలి అడుగు

- ప్లేట్ లోడ్ టెస్ట్ నిర్వహించనున్న అధికారులు

వెంకటాపురం(ఎం): ప్రపంచ ప్రసిద్ధి చెందిన రామప్ప దేవాలయం పక్కన ఉన్న కామేశ్వరాలయ పునరుద్ధరణ పనులకు తొలి అడుగుపడింది. 2011లో పునరుద్ధరణ పేరుతో శిథిలావస్థలో ఉన్న ఈ ఆలయాన్ని తొలగించారు. పదేళ్లకు పైగా శిల్పాలు ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ శిథిలావస్థకు చేరుకున్నాయి. 2021లో రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు రావడంతో కామేశ్వరాలయాన్ని పునరుద్ధరించాలని షరతు విధించింది. దీంతో కేంద్ర పురావస్తుశాఖ అధికారులు పునఃనిర్మాణం కోసం ప్రయత్నాలు చేస్తూ వచ్చారు. కేంద్ర ప్రభుత్వం 2022లో రూ.12 కోట్ల నిధులు కేటాయించింది. 2022 డిసెంబర్ 28న రామప్ప ఆలయానికి వచ్చిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కేంద్ర ప్రభుత్వ నిధులతో రూ.61 కోట్లతో ప్రశాద్ పథకం, కామేశ్వరాలయ పునర్నిర్మాణ పనుల కోసం వేర్వేరుగా శిలాఫలకాలను ఆవిష్కరించారు. అయిప్పటికీ కేంద్రపురావస్తుశాఖ అధికారుల నిర్లక్ష్యం మూలంగా పనులు ముందుకు సాగలేదు. ప్రస్తుతం కామేశ్వరాలయ పునరుద్ధరణ కోసం శిల్పాల బరువును ఎంతమేర తట్టుకుని ఆ ప్రాంతం నిలబడుతుందని ప్లేట్ లోడ్ టెస్ట్ (సాయిల్ స్ట్రెంత్ టెస్ట్) నిర్వహించేందుకు మంగళవారం పనులు ప్రారంభించారు. కేంద్ర పురావస్తుశాఖకు చెందిన ఢిల్లీ స్థాయి అధికారితోపాటు హైదరాబాద్‌కు చెందిన పురావస్తుశాఖ అధికారులు వారం రోజుల్లోగా ప్లేట్ లోడ్ టెస్ట్‌ను నిర్వహించనున్నట్లు తెలిసింది. దీని ఫలితాన్ని బట్టి జనవరి చివరివారంలోగా కామేశ్వరాలయ పునరుద్ధరణ పనులను ప్రారంభించనున్నట్లు సమాచారం. 13 ఏళ్ల తర్వాత ఆలయ పనులు ప్రారంభం అవుతుండడంతో పర్యాటకులు, స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



సాయిల్ స్ట్రెంత్ టెస్ట్ కోసం ఏర్పాటు చేసిన సెట్టింగ్

కాకతీయ రాజ్య స్థాపనకు కీలక ఘట్టం గూడూరు శాసనం

- శిలాశాసన పుస్తకం ఆవిష్కరణ సభలో ప్రొఫెసర్ విజయబాబు



గూడూరు శిలాశాసనం వద్ద ప్రొఫెసర్ విజయబాబు, లింగంపల్లి రామచంద్ర, తదితరులు

పాలకుర్తి టౌన్: కాకతీయుల రాజ్యస్థాపనకు, పాలనావైభవానికి గూడూరు శాసనం కీలక ఘట్టమని, 990 ఏళ్ల నాటి ఈ శిలాశాసనానికి పట్టాభిషేకం చేయడం గర్వంగా ఉందని కాకతీయ విశ్వవిద్యాలయం చరిత్ర విభాగం విశ్రాంత ప్రొఫెసర్ కె.విజయబాబు అన్నారు. మంగళవారం జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడూరులోని శిలా శాసనానికి తొమ్మిది శతాబ్దాలు పూర్తయిన సందర్భంగా 'పోతన చైతన్య వేదిక గూడూరు' ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించగా ముఖ్య అతిథులుగా డాక్టర్ లింగంపల్లి రామచంద్రతో కలిసి ప్రొఫెసర్ విజయబాబు పాల్గొని గూడూరు శాసనం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ కాకతీయుల పాలనా వైభవాన్ని మరోసారి గుర్తుకు తెచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రాంతంలో విద్యవేత్త చుక్కా రామయ్య, చొడవరపు విశ్వనాథం, చాకలి ఐలమ్మ లాంటి గొప్ప వారు జన్మించారన్నారు. ప్రముఖ రచయిత డాక్టర్ లింగపల్లి రామచంద్ర మాట్లాడుతూ కాకతీయుల కాలంలో గూడూరును రాజధానిగా చేసుకొని పాలించిన విరియాల వంశీయుడు మల్లన్న చెరువు నిర్మించారని, ప్రజల తాగేందుకు బావిని కూడా తవ్వించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పోతన చైతన్య వేదిక అధ్యక్షుడు అనుముల ఎల్లయ్య, కార్యదర్శి ఆర్తి పరాంకుశం, మాజీ ప్రొఫెసర్ ఎల్లంబట్ల నాగయ్య, శంకరమంచి శ్యాంప్రసాద్, రాపోలు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ మాచర్ల పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శి లింగయ్య, మన్యపు బుజేందర్, ఎల్లంబట్ల శేషయ్య, వీరమల్ల బాబురావు, శంకరమంచి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి పుష్కరాలకు ప్రణాళికలు

- వచ్చే ఏడాది మే 15 నుంచి పుష్కరాలు
- రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కాళేశ్వరం: వచ్చే ఏడాది మే 15 నుంచి సరస్వతి నది పుష్కరాల నిర్వహణ, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై సంబంధితశాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం ఆయన జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కేంద్రంలో జాతీయ రహదారి 353(సీ)పైన కాళేశ్వరం దేవస్థానం ఆర్చిగేటు పునఃనిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ వచ్చే ఏడాది ఫిబ్రవరిలో శివరాత్రికి, మే నెలలో జరగనున్న సరస్వతి నది పుష్కరాలకు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించనున్నామన్నారు. జిల్లా మీదుగా కాళేశ్వరం.. సిరొంచ వరకు నాలుగు వరుసల రహదారికి అనుగుణంగా వెడల్పుతోపాటు అధునాతన డిజైన్‌తో ఆర్చి నిర్మాణం చేయాలన్నారు. నాలుగు వరుసల రహదారి కోసం ప్రతిపాదనలు చేస్తున్నామని పేర్కొన్నారు.పుష్కరాలకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తజనం తరలి రానున్నందున, వారికి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు అందజేస్తామన్నారు.



ఆర్చిగేటుకు భూమి పూజ చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

వాట్సాప్‌లో రెచ్చగొట్టే మెసెజ్‌లు పోస్టు చేసిన ఇద్దరికి రిమాండ్

దుగ్గొండి: వాట్సాప్ గ్రూపుల్లో రెచ్చగొట్టే మెసెజ్‌లు పోస్టు చేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన ఓ వ్యక్తి, గ్రూప్ అడ్మిన్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 14రోజుల రిమాండ్ విధించినట్లు దుగ్గొండి సీఐ సాయిరమణ మంగళవారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. దుగ్గొండి మండలం బిక్కాజిపల్లి గ్రామంలో మన గ్రామం.. మన అభివృద్ధి టైటిల్‌తో 55 మంది సభ్యులతో వాట్సాప్ గ్రూప్ ఉంది. గ్రూప్ అడ్మిన్‌గా మేర్గు రాజు ఉన్నాడు. ఈ క్రమంలో ఈనెల 8న గ్రామానికి చెందిన మాచపత్రి ఈశ్వరయ్య.. పార్టీలు, ఆయా పార్టీల కార్యకర్తలను రెచ్చగొట్టేలా వాయిస్ మెసెజ్‌లు పోస్టు చేసి గ్రామంలో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా వ్యవహరించాడు. దీంతో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా నేరం నిరూపణ అయ్యింది. దీంతో మాచపత్రి ఈశ్వరయ్య, గ్రూప్ అడ్మిన్ మేర్గు రాజును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14రోజుల రిమాండ్ విధించారని సీఐ తెలిపారు. వాట్సాప్ గ్రూపుల్లో అనవసర, ఇతరులకు ఇబ్బందులు కల్పించే మెసెజ్‌లు పోస్టు చేస్తే చేసినవారితో పాటు గ్రూప్ అడ్మిన్‌పై చర్యలు తీసుకుంటామన్నారు.సీఐ వెంట ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..

భర్తను హత్య చేయించిన భార్య

- ఈ ఘటనలో నలుగురు నిందితుల అరెస్ట్, రిమాండ్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రవీందర్

ములుగు: జిల్లా కేంద్రంలోని బండారుపల్లి రోడ్డులోని ఓపెన్ ప్లాట్లలో ఈ నెల 21వ తేదీన అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఓర్సు శ్రీను (37) కేసును పోలీసులు చేధించారు. భార్య వివాహేతర సంబంధం పెట్టుకుని పథకం ప్రకారం శ్రీనును హత్య చేయించినట్లు పోలీసులు తెలిపారు. ములుగు డీఎస్పీ నలువాల రవీందర్ కథనం ప్రకారం.. ఉమ్మడి కరీంనగర్ జిల్లా గోదావరిఖనికి చెందిన ఓర్సు శ్రీను తన భార్య స్వప్నతో కలిసి హనుమకొండలో ఉంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. స్వప్న తన స్వగ్రామం హసన్‌పర్తి మండలం మడిపల్లికి చెందిన బుర్ర సంతోశ్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని, తరచూ మద్యం తాగొచ్చి వేధింపులకు గురిచేస్తున్నాడనే కారణంతో భర్తను హత్య చేయడానికి ప్లాన్ వేసింది. అనుకున్నదే తడువుగా సంతోశ్‌కు రూ. 30వేలు ఇవ్వగా అతడు తనకు తెలిసిన నడికుడ మండలం కంఠాత్మకూర్‌కు చెందిన ఆకుల అనిల్, బెల్లంకొండ చంద్రమోహన్‌ను కలిసి మేడారం వెళ్లడానికి ప్లాన్ చేశాడు. అయితే వీరితోపాటు మనం కూడా మేడారం వెళ్దామని స్వప్న తన భర్త శ్రీనును ఒప్పించింది. దీంతో 21వ తేదీ రాత్రి శ్రీను, స్వప్న, అనిల్, చంద్రమోహన్ ఆటోలో, సంతోశ్ కారులో బయలుదేరారు. ఈ క్రమంలో రాత్రి 11 గంటలకు ములుగు సమీపంలో బండారుపల్లి రోడ్డు పక్కన ఉన్న ఓపెన్ ప్లాట్లకు తీసుకెళ్లి ప్లాన్ ప్రకారం శ్రీనుకు మద్యం తాగించారు. అనంతరం గొడవపడి రాయితో తలపై బలంగా కొట్టారు. దీంతో శ్రీను అక్కడికక్కడే చనిపోయాడు. ప్రాణం పోయిందని నిర్ధారించుకున్న తర్వాత ఘటనా స్థలి నుంచి పరారయ్యారు. మరుసటి రోజు వివరాలు తెలుసుకున్న పోలీసులు డ్రైవింగ్ లైసెన్స్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు డీఎస్పీ రవీందర్ ఆధ్వర్యంలో పస్రా సీఐ రవీందర్, ములుగు ఎస్సైలు వెంకటేశ్వర్‌రావు, లక్ష్మారెడ్డి నేతృత్వంలోని మూడు ప్రత్యేక బృందాలు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ పుటేజీ ద్వారా ఆ రోజు రాత్రి వాహనాల కదలికల గమనించారు. ఈ క్రమంలో మంగళవారం ములుగు మండలం గట్టమ్మ ఆలయ సమీపంలో నిందితులు స్వప్న, సంతోశ్, అనిల్, చంద్రమోహన్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. దీంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి కారు, ఆటో, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ రవీందర్ తెలిపారు.



నిందితుల అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ రవీందర్

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

న్యూశాయంపేట: మైనార్టీ (ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్శీ) నిరుద్యోగ యువతకు వివిధ కోర్సుల్లో మూడునెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు వరంగల్, హనుమకొండ జిల్లాల మైనార్టీ సంక్షేమ అధికారులు టి.రమేశ్, డి.మురళీధర్‌రెడ్డి వేర్వేరు ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఇంటర్, ఆపై చదువుకున్న అర్హులైన యువతకు జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, డిజిటల్ మార్కెటింగ్ మేనేజర్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. దరఖాస్తులను ఈనెల 31లోగా ఆయా కార్యాలయాల్లో అందజేయాలన్నారు. వివరాలకు హనుమకొండ జిల్లా వారు సుబేదారి కలక్టరేట్ కాంప్లెక్స్‌లో 2వ అంతస్తు, వరంగల్ జిల్లా వారు సుబేదారి అపోలో ఫార్మసీ పక్కన 2వ అంతస్తులో ఉన్న కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

అవయవదానానికి అంగీకారం

హసన్‌పర్తి: మరణానంతరం తమ పార్థివదేహాలను కాకతీయ మెడికల్ కళాశాలకు అప్పగించేందుకు దంపతులు ముందుకు వచ్చారు. హనుమకొండ మండలం గోపాలపురం వినాయక నగర్‌కాలనీకి చెందిన సూరం మహేందర్ ఆర్టీసీలో ఉద్యోగి, ఆయన భార్య పద్మజా గృహిణి. కాగా మరణానంతరం తమ దేహాలను వైద్య విద్య విద్యార్థులకు ఇవ్వడానికి నిర్ణయించారు. తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు కామిడి సతీశ్‌కు సమాచారం అందించారు. ఈమేరకు మంగళవారం వారు ఆ దంపతుల ఇంటికి వెళ్లి వారితో మాట్లాడి వారినుంచి అంగీకార పత్రం తీసుకున్నారు. ఈ పత్రాన్ని కాకతీయ మెడికల్ కళాశాలకు అందిస్తామన్నారు. మునిగాల పద్మపుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అంగీకార పత్రాన్ని చూపుతున్న దంపతులు

ఇండియన్ ఎకనామిక్ సదస్సుకు శ్రీధర్‌కుమార్‌లోథ్



శ్రీధర్‌కుమార్‌లోథ్

కేయూ క్యాంపస్: హరియాణలోని కురుక్షేత్ర యూనివర్సిటీలో ఈనెల 27, 28, 29 తేదీల్లో జరగనున్న ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్ సదస్సులో హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీధర్‌కుమార్‌లోథ్ పాల్గొననున్నారు. 'సోషియో అండ్ డెమోగ్రాఫిక్ ఫీచర్స్ ఆఫ్‌ది పాపులేషన్ ఏ స్టడీ ఇన్ తెలంగాణ' అనే అంశంపై ఆయన పరిశోధన పత్రం సమర్పించనున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

- హౌస్, ప్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్, చేసుకొని అమౌంట్ ఇప్పించబడును. సిబిల్ అవసరం లేదు. సంప్ర॥ 8341479342. [WA-7550]

BUSINESS OFFER

- మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబి డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-6124]

WANTED

- సానిటరీ షాపులో పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువకులు కావలెను. జీతం: 10000 పైనే, సాయి శ్రీ ఎంటర్ ప్రైజస్, ఫాతిమానగర్ జంక్షన్ ఖాజీపేట, సంప్ర॥ 8712555227, 9502270178. [WA-631]
- Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 15,000 నుండి 20,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-1256014]
- త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, ఫుడ్ జీ : 18K. Ph: 9640400073, 9160900024 [SCA24000888]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.